సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ సావిత్రీమేఘారెడ్డి

మున్సిపల్ సాధారణ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సావిత్రీమేఘారెడ్డి

మోత్కూరు, సెప్టెంబర్ 30 : ప్రజలు సీజనల్ వ్యాధుల భారిన పడకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రీమేఘారెడ్డి అన్నారు. శనివారం మోత్కూరు మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. బతుకమ్మ, దసరా ఉత్సవాల నేపథ్యంలో ప్రజలు ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలతో పాటు వార్డుల్లో పారిశుధ్యానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కమిషనర్ శ్రీకాంత్, మున్సిపల్ కౌన్సిలర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు

స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి అండగా బీఆర్ఎస్‌లో చేరికలు : ఎంపీపీ రేణుక

గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎంపీపీ రేణుక

అర్వపల్లి, సెప్టెంబర్ 30 : అభివృద్ధికి అండగా ఉండేందుకే వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్య యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని జాజిరెడ్డిగూడెం నుంచి వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఎంపీపీ, జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో గోగుల శ్రీనివాస్, నర్సింగ లింగయ్య, బొల్లెపల్లి సత్తయ్య, చల్లా విజయ్, చింతల భిక్షం, రాకేశ్, మహేశ్‌తో పాటు పలువురు మహిళలు ఉన్నారు. కార్యక్రమంలో కొప్పుల సోమిరెడ్డి, సర్పంచ్ కుంభం ఉషారాణి, నాగరాజు, గ్రామశాఖ అధ్యక్షులు పున్న హరిప్రసాద్, కార్యదర్శి కొటమర్తి మల్లయ్య, వార్డు సభ్యులు, నాయకులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు సాయికుమార్

సాయికుమార్

మోత్కూరు, సెప్టెంబర్ 30 : రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మోత్కూరుకు చెందిన సాయికుమార్ ఎంపికయ్యాడు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్న సాయికుమార్ ఇటీవల నల్లగొండలో జరిగిన 61వ స్కూల్ గేమ్స్ పోటీల్లో అండర్-19 విభాగంలో పాల్గొని ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ ప్రభాజస్టిన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1, 2, 3 తేదీల్లో సంగారెడ్డిలో జరుగనున్న రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో సాయికుమార్ పాల్గొననున్నట్లు వెల్లడించారు.

అండర్-14 విభాగంలో..

మోత్కూరు సెక్రేడ్ హార్ట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఫుట్‌బాల్ అండర్-14 విభాగంలో ప్రతిభ చూపి జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ తానయ్య తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో పాఠశాల స్థాయి జిల్లా క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు.

మోడ్రన్ ధోబీఘాట్లను సద్వినియోగం చేసుకోవాలి

- రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య

మోత్కూరులో నిర్మాణంలో ఉన్న ధోబీ ఘాట్‌ను పరిశీలిస్తున్న ఆశయ్య

మోత్కూరు, సెప్టెంబర్ 30 : రాష్ట్ర ప్రభుత్వం రజకుల సంక్షేమం కోసం నిర్మాణం చేస్తున్న మోడ్రన్ ధోబీఘాట్లను సద్వినియోగం చేసుకోవాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య అన్నారు. పట్టణంలో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న ధోబీఘాట్ నిర్మాణ పనులను శనివారం స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు బొడ్డుపల్లి మైసయ్య, యాకయ్య, లక్ష్మయ్య, సతీశ్, ఉప్పలయ్య, కృష్ణ, సోమయ్య పాల్గొన్నారు.

గర్భిణులకు న్యూట్రీషన్ కిట్ల పంపిణీ

నూతనకల్, సెప్టెంబర్ 30 : మాతా, శిశు సంరక్షణకు ప్రభుత్వం న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేస్తున్నదని ఎంపీపీ భూరెడ్డి కళావతీసంజీవరెడ్డి, జడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. గర్భిణులకు పోషకాహార లోపం, రక్త హీనత లేకుండా కాపాడేందుకు ప్రభుత్వం 8 రకాల వస్తువులతో కూడిన కిట్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. అవకాశాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి, మండల వైద్యాధికారి ఆశ్రితరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మోత్కూరుకు 30 పడకల దవాఖానపై సంబురాలు

- రూ.10 కోట్ల నిధుల ప్రకటనను హర్షిస్తూ సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

మోత్కూరులో సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు

మోత్కూరు, సెప్టెంబర్ 30 : మోత్కూరు పీహెచ్‌సీని 30 పడకల దవాఖానగా మారుస్తూ రూ.10 కోట్ల నిధులను ప్రకటించడం శుభపరిణామం అని పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు అన్నారు. 30 పడకల దవాఖాన మంజూరును హర్షిస్తూ సీఎం కేసీఆర్, మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఫ్లెక్సీకి శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సంబురాలు చేసి క్షీరాభిషేకం నిర్వహించారు. జిల్లాలో మారుమూల ప్రాంతమైన మోత్కూరు పీహెచ్‌సీ మోత్కూరు, గుండాల, ఆత్మకూరు(ఎం), అడ్డగూడూరు మండలాల ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలను మరింత చేరువ చేస్తుందన్నారు. కార్యక్రమంలో మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రీమేఘారెడ్డి, వైస్ చైర్మన్ వెంకటయ్య, బీఆర్ఎస్ మండల, మున్సిపాలిటీ అధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్, బొడ్డుపల్లి కళ్యాణ్ చక్రవర్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాకూబ్‌రెడ్డి, మేఘారెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణులకు చేరువ కానున్న వైద్య సేవలు

అడ్డగూడూరు : మోత్కూరు ప్రభుత్వ దవాఖానను 10 పడకల నుంచి 30 పడకల దవాఖానగా ఏర్పాటు చేస్తానని మంత్రి హరీశ్‌రావు హామీ ఇవ్వడం శుభ పరిణామం అని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్ అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. మోత్కూరులో 30 పడకల దవాఖాన ఏర్పాటుతో అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం), గుండాల మండలాల ప్రజలకు వైద్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. 30 పడకల దవాఖాన ఏర్పాటుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారని పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

తిరుమలగిరిలో మున్సిపాలిటీ రిసోర్స్ పర్సన్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీఎం సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

తిరుమలగిరి, సెప్టెంబర్ 30 : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీ రిసోర్స్ పర్సన్లకు గౌరవ వేతనం రూ.2 వేలు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ ఫ్లెక్సీకి మున్సిపాలిటీ రిసోర్స్ పర్సన్స్ యూనియన్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆర్పీలు మాట్లాడుతూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, నాయకులు దూపటి రవీందర్, సందీప్ ,యాకూబ్‌నాయక్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

అర్వపల్లి, సెప్టెంబర్ 30 : మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఎల్గూరి నర్సయ్య ఇటీవల మృతి చెందారు. కుటుంబ సభ్యులను శనివారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. నర్సయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట ఎస్ఎంసీ చైర్మన్ తండా లింగమూర్తి, పాల కేంద్రం చైర్మన్ చల్లా వేణుధర్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు కందుల దశరథ రామారావు, నిమ్మల లింగయ్య ఉన్నారు.

నాగారంలో..

నాగారం : మండలంలోని డి.కొత్తపల్లి గ్రామంలో అనారోగ్యంతో ఇటీవల వేముల లింగయ్య, ఇరుగు యశోద మృతిచెందారు. కుటుంబ సభ్యులను వైస్ ఎంపీపీ మణిమాల పరామర్శించి మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం చేశారు. సర్పంచ్ నరసింహారెడ్డి, గుంటకండ్ల ముకుందారెడ్డి, బెల్లి సైదులు, గంగయ్య, లింగయ్య, వెంకన్న పాల్గొన్నారు.

కార్మికులకు ఆరోగ్య భరోసా రిజిస్ట్రేషన్

నూతనకల్, సెప్టెంబర్ 30 : పంచాయతీ కార్మికులు హెల్త్ ఇన్సూరెన్స్, లేబర్ కార్డుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సర్పంచ్ కుందెన అమ్మక్కాభద్రాచలం అన్నారు. శనివారం మండలంలోని మాచనపల్లి గ్రామంలో రిజిస్ట్రేషన్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. పంచాయతీ పరిధిలోని కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీ పరిధిలోని కార్మికులు ఆరోగ్య భరోసా కోసం తప్పనిసరిగా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలి

- డీసీసీబీ డైరెక్టర్ సైదులు
- ఆరు నెలల్లో రూ.12.50 కోట్ల ఆర్థిక లావాదేవీలు

సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ సైదులు

తుంగతుర్తి, సెప్టెంబర్ 30 : రైతులు సకాలంలో పంట రుణాలకు వడ్డీ చెల్లించి సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. శనివారం తుంగతుర్తి రైతు సేవా సహకార సంఘంలో నిర్వహించిన మహాజన సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. మార్చి 2023 నుంచి సెప్టెంబర్ 2023 వరకు ఆరు నెలల్లో సొసైటీ రూ.12.50 కోట్ల లావాదేవీలు నిర్వహించినట్లు తెలిపారు. సొసైటీ ద్వారా 10 వేల యూరియా బస్తాలు, 2 వేల డీఏపీ బస్తాలు అందించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన పంట రుణాల మాఫీలో 527 మంది రైతులకు రూ.ఒక కోటి 70 లక్షలను మాఫీ చేయడం జరిగిందన్నారు. రైతులకు వారి ఖాతాల్లో జమ చేసి డబ్బులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ మోడెం శ్రీలత, సొసైటీ డైరెక్టర్లు రామచంద్రు, మల్లయ్య, మజీదు, భిక్షంరెడ్డి, రామనర్సమ్మ, ఇదప్ప, పూలమ్మ, యాకయ్య, రవీందర్‌రెడ్డి, సొసైటీ సిబ్బంది యాదగిరి, మహేశ్, ఉమేశ్, సొసైటీ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 30 : జిల్లా కేంద్రంలోని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఈ నెల 2న శరత్ మ్యాక్సీ విజన్ లేజర్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి వారిచే ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు తమ హెల్త్‌కార్డు వెంట తీసుకొచ్చి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టైరు పేలి వ్యక్తి మృతి

తుంగతుర్తి, సెప్టెంబర్ 30 : టైరు పేలి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శనివారం జరిగింది. ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద గాలిమిషన్ నడుపుతున్న సైదా(40) టైరుకు గాలి పెడుతుండగా ప్రమాదవశాత్తు టైరు పేలడంతో తలకు తీవ్ర గాయమైంది. చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. సైదా గడిచిన 20 ఏండ్లుగా టైర్లకు పంక్చర్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సైదాకు భార్య, కుమారుడు ఉన్నారు.

కారు బోల్తా.. నలుగురికి గాయాలు

నాగారం, సెప్టెంబర్ 30 : కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో అందులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి నాగారం బంగ్లాలో పెట్రోల్‌బంక్ సమీపంలో జరిగింది. సూర్యాపేట-జనగామ జాతీయ రహదారి 365బిపై ప్రయాణిస్తున్న కారు ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్ల పొదల్లోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. స్థానిక యువకులు కారు డోర్లు తెరిచి వారి ప్రాణాలను కాపాడారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ముత్తయ్య సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. స్వల్ప గాయాలు కావడంతో ప్రథమ చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.